శిథిలావస్థలో కరంజి బ్రిడ్జి డివైడర్

ప్రమాదకరంగా బ్రిడ్జిలు

భీంపూర్ మండలం కరంజి(టీ) గ్రామంలోని పెద్ద బర్రెపై ఏళ్లక్రితం నిర్మించిన బ్రిడ్జి సైడ్ వాల్, డివైడర్లు శిథిలావస్థలో ప్రమాదకరంగా మారాయి. అలాగే కరంజి - గుబిడి వెళ్లే రోడ్డుకు టేకిడిరాంపూర్ వాగుపై ఉన్న బ్రిడ్జి రోడ్డు గతంలోని వరదలకు కోతకు గురై క్రమంగా శిథలమై గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో వాహనదారులకు పెను ప్రమాదంగా మారే అవకాశం ఉన్నది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

-భీంపూర్, డిసెంబర్ 1

టేకిడిరాంపూర్ వద్ద ధ్వంసమైన బ్రిడ్జి

దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 1: నిర్మల్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో మహిళా, శిశు, వయోవృద్ధుల,దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని దివ్యాంగులు పాల్గొనాలని కోరారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

ఉట్నూర్, డిసెంబర్ 1: ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర గిరిజన నాయకుడు రాథోడ్ రితేశ్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని అంబేద్కర్ చౌక్‌లో ప్రభుత్వం రైతులు, విద్యార్థులను మోసం చేస్తున్నందున ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతులకు రైతుబంధు, రుణమాఫీ ఇచ్చేవారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటిని అమలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ అందించడం లేదన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడు అరెస్ట్

ఎదులాపురం, డిసెంబర్ 1: ఆదిలాబాద్‌లోని సాత్నాల బస్టాండ్ సమీపంలో బంగారిగూడాకు చెందిన మట్కా నిర్వాహకుడు బబ్లూను అరెస్ట్ చేసి రూ.2300 స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. అతని వద్ద ఉన్న మట్కా చిట్టిలు, సెల్ ఫోన్, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

- **బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**

బోథ్, డిసెంబర్ 1: బోథ్ మండలం నిగిని గ్రామ సమీపంలోని శ్రీ శిఖర్ కైలాస్ కొండపై కొలువైన నర్మదేశ్వర ఆలయ 22వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, ఆలయ వ్యవస్థాపకుడు సంత్ శ్రీ లింబాజీ మహారాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం నేరడిగొండలోని క్యాంపు కార్యాలయంలో మహారాజ్ ఎమ్మెల్యేతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 9 వరకు వార్షికోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. శోభాయాత్ర, గణపతి, గోపూజ, యాగశాల వ్యవస్థీకరణ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. తన నివాసానికి వచ్చిన లింబాజీ మహారాజ్‌ను ఎమ్మెల్యే దంపతులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

బోథ్: పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్, లింబాజీ మహారాజ్

5న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

బజార్‌హత్నూర్, డిసెంబర్ 1: బజార్‌హత్నూర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల పోస్టర్‌ను ఆదివారం నేరడిగొండలోని తన నివాసంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. మొదటి బహుమతిగా రూ.25వేలు, రెండవ బహుమతి రూ.15వేలు, మూడవ బహుమతి రూ.5వేలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు శేఖర్, యువకులు ప్రభాకర్, మణివర్ధన్, సుకుమార్, జానార్దన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..

తాంసి(భీంపూర్), డిసెంబర్1 : బోథ్ నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. భీంపూర్ మండలం భగవాన్‌పూర్ రోడ్డు మరమ్మతులు చేయిస్తానని చెప్పి సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, మహేందర్, తిరుమల్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంబురాల పేరుతో ప్రజాధనం వృథా

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 1 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న ప్రజలకు ఒరిగిందేమి లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం అడివయ్య అన్నారు. ఆదివారం నిర్మల్‌లోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దుర్గం నూతన్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమలుకు నోచుకోని 420 హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలకు ఒరిగిందేమి లేదని అన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప మిగతా హామీలు ప్రజలకు అమలు చేయకుండా సంబురాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో ఎందుకు అమలు చేయలేదో రైతులకు సమాధానం చెప్పాలన్నారు. ఏడాది పాలన పేరుతో సంబురాలు చేసుకోవడం కాదని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, తేమ పేరుతో సంచికి 2 కిలోల తరుగు తీయడం రైతులను దోచుకోవడం లాంటిదేనన్నారు. రాష్ట్ర ప్రజలపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హామీలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, నాయకులు ఫాసియొద్దీన్, శంభు, కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విస్మరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ఎదులాపురం, డిసెంబర్ 1 : రాష్ట్రంలో ఉన్న 25 లక్షల మంది రైతులకు పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం 50 లక్షల కార్మికులను ఎందుకు విస్మరిస్తుందో అర్థం కావడం లేదని రిటైర్డ్ లేబర్ ఆఫీసర్ జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని మర్వాడి ధర్మశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులను విస్మరించడం సరైన విధానం కాదన్నారు. విజయోత్సవ సంబురాలు జరుపుకుంటున్న ప్రభుత్వానికి కార్మికులు కనబడడం లేదా అని ప్రశ్నించారు. కార్మిక శాఖ ద్వారా సంక్షేమ పథకాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ఖానాపూర్ పోస్టల్ అధికారి ఆక్రమణలపై విచారణ జరిపించాలి

ఖానాపూర్, డిసెంబర్ 1: ఖానాపూర్ పోస్టల్ అధికారి(ఎస్‌వో) ఆక్రమణలపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి అల్లెపు ఫీటర్, సహాయక కార్యదర్శి భూక్యా సురేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖానాపూర్‌లోని విశ్రాంతి భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. అర్హులైన పింఛన్ దారులకు ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులను అందజేయడంలో రూ. 16 నుంచి రూ.100 వరకు దండుకుంటున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు పింఛన్ పంపిణీ చేసే మిషన్లను అప్పగించి ఉపాధి, ఆసరా పింఛన్లలో కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. ఖానాపూర్ ఎస్‌వో నిబంధనలకు విరుద్ధంగా పోస్టు మాస్టర్ల వద్ద డబ్బులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంసీపీఐయూ అఖిల భారత సమైక్య జిల్లా కార్యదర్శి స్వూరుప, గణేశ్, సంధ్య, అరుణ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

ఎదులాపురం, డిసెంబర్ 1 : ప్రజలను చైతన్య పరిచి వారికి వ్యాధిపై పూర్తి అవగాహన కల్పిస్తూనే ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించవచ్చని ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాప్తి, నివారణ, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ గజానంద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

విద్యార్థులకు తిను బండారాలు పెట్టొద్దు

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ కాత్లే రమేశ్

ఇచ్చోడ(సిరికొండ), డిసెంబర్ 1 : తల్లిదండ్రులు, ఇతరులు బయట నుంచి తెచ్చిన తిను బండారాలు విద్యార్థులకు ఇవ్వొద్దని ఏఎస్ఐ కాత్లే రమేశ్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆదివారం సిరికొండలోని కస్తూర్బా, రిమ్మ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలను సందర్శించడం జరిగిందన్నారు. బయట వ్యక్తులను లోపలికి అనుమతించొద్దని సూచించారు. ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట కానిస్టేబుల్ తెలంగ్‌రావ్, ఏఎన్ఎం స్వప్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఆయాకు సన్మానం

ముత్తవ్వను సన్మానిస్తున్న మత్స్యకారుల సంఘం సభ్యులు

దిలావర్‌పూర్, డిసెంబర్ 1 : న్యూలోలం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేసిన గుమ్ముల ముత్తవ్వ ఉద్యోగ విరమణ పొందడంతో ఆదివారం గ్రామానికి చెందిన యువకులు, మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నిర్మల్ రైతు సేవా సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మంద మల్లేశ్, న్యాయకపోడు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య, మత్స్యసహకార సంఘం సభ్యులు నారాయణ, దాసు, నర్సయ్య, రమేశ్, చింటు, గంగయ్య, రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరట్టు ఉత్సవం

ఆరట్టు ఉత్సవంలో పాల్గొన్న సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి

ఎదులాపురం, డిసెంబర్ 1 : ఆదిలాబాద్‌లోని శ్రీ రామచంద్ర గోపాల కృష్ణ మఠం నుంచి ఆరట్టు ఉత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. గోపాల కృష్ణ మఠం నుంచి వినాయక్ చౌక్, అశోక్ రోడ్డు, అంబేద్కర్ చౌక్ గుండా సాగింది. ముందుగా అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని అందంగా అలంకరించిన పల్లకీలో ఉంచి ఊరేగింపు ప్రారంభించారు. భక్తుల భజన గీతాల నడుమ ఊరేగింపు ఆద్యంతం కోలహల వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో గోపాల కృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, బెల్లూరి అయ్యప్ప ఆలయ అధ్యక్షుడు కుంబోజీ సూర్యకాంతం, ప్రధాన కార్యదర్శి రవి, గౌరవాధ్యక్షుడు జీవన్, వేదపండితులు పాల్గొన్నారు.

ఎస్ఐకు సన్మానం

ఎస్ఐని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బేల, డిసెంబర్ 1: బేల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన దివ్యభారతిని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దేవన్న, మధుకర్, తాన్‌బా, వీపిన్, మాంగేశ్, విఠల్, జితేందర్, మనోజ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాజీరావ్ బాబా పుణ్యతిథి వేడుకలు

బేల, డిసెంబర్ 1: ఆధ్యాత్మిక గురువు బాజీరావ్ బాబా పుణ్యతిథి వేడుకలను కంగార్‌పూర్ గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐ దివ్యభారతి హాజరై పల్లకీ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అలవర్చుకోవాలన్నారు. మహారాజ్ చూపిన మార్గంలో నడుచుకుంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మహారాజ్ భక్తులు నానాజీ, విఠల్, మహిళలు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిలిపివేత

బేల, డిసెంబర్ 1 : మండలకేంద్రంలోని మా ఆశపుర జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు ఎక్కువ ఉండడంతో సోమ, మంగళవారం పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ సెక్రటరీ మధుకర్, శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుంచి యథావిధిగా కొనుగోలు చేపడుతామని రైతులు గమనించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెలు మృతి

బజార్‌హత్నూర్, డిసెంబర్ 1 : బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పిప్పిరి గ్రామంలోని రైతు కుర్మ రాజమల్లుకు చెందిన గొర్రెలు ఆర్‌అండ్‌బీ రోడ్డు దాటుతున్న గ్రామంలో బజార్‌హత్నూర్ నుంచి ఇచ్చోడ వైపు కంకరలోడ్‌తో వెళ్తున్న టిప్పర్ వాహనం గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 12 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని రైతు తెలిపారు.

సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 1 : నిర్మల్‌లోని 14వ వార్డు విద్యానగర్ కాలనీలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పర్యటించారు. కాలనీలో నెలకొన్న మౌలిక సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసులు విన్నవించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

పోలీస్ కిష్టయ్య వర్ధంతి

బోథ్: కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బోథ్, డిసెంబర్ 1: కౌఠ(బీ) గ్రామంలో పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ముదిరాజ్ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు మందుల రమేశ్, బోథ్ మండలాధ్యక్షుడు భోజన్న, గ్రామ అధ్యక్షుడు సున్నపు శ్రీనివాస్ ముదిరాజ్, జెట్టి రాజేశ్వర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ నర్సయ్య పాల్గొన్నారు.

భైంసా, డిసెంబర్ 1 : భైంసాలోని బైపాస్ రోడ్డులో గల ముదిరాజ్ భవన్‌లో పోలీసు కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ హక్కుల పరిరక్షణ సమితి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ సుంకెట పోశెట్టి, నాయకులు వెంకటేశ్, నర్సింహులు, గంగాధర్, లక్ష్మణ్, యోగేశ్ పాల్గొన్నారు.

పోలీసు కిష్టయ్య విగ్రహం ఏర్పాటు చేయాలి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 1 : నిర్మల్‌లోని టీఎన్‌జీవో సంఘ భవనంలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్ కమిటీ సభ్యుడు దేవేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి అమరుడైన పోలీస్ కిష్టయ్య అని కొనియాడారు. నిర్మల్‌లో పోలీస్ కిష్టయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ గంజ్రత్ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమా మహేశ్వర్, సాయి, ఆనంద్, పోశెట్టి, సత్యం, పోతన్న, నరేశ్ పాల్గొన్నారు.

కుంటాల, డిసెంబర్, 1 : కల్లూరు గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు వంశీ ముదిరాజ్, ముదోల్ల శంకర్, ప్రశాంత్, జీవన్, రాజ్ కుమార్, శ్రావణ్, ఈశ్వర్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ముథోల్, డిసెంబర్ 1 : ముథోల్‌లోని కొత్త బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పోలీసు కిష్టయ్య వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, ఆటో యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు సాయి, సభ్యులు బాలాజీ, సాయి, లక్ష్మణ్, అనిల్ పాల్గొన్నారు.

నర్సాపూర్ (జీ), డిసెంబర్ 1 : మండల కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ హన్మాండ్లు, ముదిరాజ్ జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జీ): నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

నిర్మల్అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

మాలల సింహగర్జన సభకు తరలిన నాయకులు

బైంసా/ఖానాపూర్/పెంబి, డిసెంబర్ 1 : హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు ఆదివారం భైంసా, ఖానాపూర్, పెంబితో పాటు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, మాల కులస్థులు తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో ముథోల్ తాలూకా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, నాయకులు గిరిధర్ జంగ్మే, ప్రసన్నజిత్ ఆగ్రే, ధర్మాజీ, ఖానాపూర్ నుంచి నాయకులు దాసరి రాజన్న, ద్యావతి రాజేశ్వర్, మ్యాదరి రాజేశ్వర్, నేత శ్యామ్, సతీశ్, శ్రీహరి, పెంబి నుంచి సంఘం మండలాధ్యక్షుడు మల్లపల్లి స్వామి, మాల సంఘాల నాయకులు ఉన్నారు.

కుంటాల, డిసెంబర్ 1 : కుంటాలలో మాలల నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్ నేతృత్వంలో అర్లీ క్రాస్ రోడ్డు వద్ద నాయకులు నినాదాలు చేస్తూ వాహనాల్లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో కార్యదర్శి చాకేటి లస్మన్న, కుంటాల మండలాధ్యక్షుడు సాయి, లోకేశ్వరం, నర్సాపూర్(జీ) మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు ఉన్నారు.

భైంసా: హైదరాబాద్‌కు వెళ్తున్న నాయకులు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 1: హైదరాబాద్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు ఇంద్రవెల్లి మండలానికి వేలాది మంది బహుజనులు తరలివెళ్లారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి నినాదాలు చేసి అక్కడి నుంచి వాహనాలలో హైదరాబాద్‌కు వెళ్లారు. వెళ్లిన వారిలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధానకార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దిలీప్‌మోరే, మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు సంతపురి రాజేశ్వర్, దళిత బహుజనులు రాజ్‌వర్ధన్, శివాజీ, భారత్, బాలాజీ, ఆనంద్‌రావ్, జితేందర్, అతీశ్, శ్రీరామ్, దత్తా, సూరజ్ ఉన్నారు.

ఇంద్రవెల్లి: హైదరాబాద్‌కు వెళ్తున్న మాల మహానాడు నాయకులు

నర్సాపూర్ (జీ), డిసెంబర్ 1 : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభకు ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల నుంచి మాల సంఘం నాయకులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో దత్తురాం, శ్రీధర్, మధు, అనిల్ ఉన్నారు.

14న పూలాజీబాబా వార్షికోత్సవ వేడుకలు

సమావేశమైన అంద్ ఆదివాసీ సమాజ్ ప్రజలు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 1: ఇంద్రవెల్లి మండలం అంజి గ్రామంలోని పూలాజీ బాబా ధ్యానకేంద్రం, ఆలయంలో ఈ నెల 14,15వ తేదీల్లో నిర్వహించే వార్షికోత్సవ వేడుకలు విజయవంతం చేయాలని అంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలు దశరథ్‌గారుశే, రాంకిషన్, పుండలిక్, ముకాడే విష్ణు పిలుపునిచ్చారు. ఆదివారం అంజి గ్రామంలోని పూలాజీబాబా ధ్యానకేంద్రం ఆలయంలో అంద్ ఆదివాసీ సమాజ్ పెద్దలతో పాటు గ్రామస్తులు సమావేశం నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలతో పాటు నూతనంగా నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవ ఉత్సవాలపై చర్చించారు. ఆలయ ప్రారంభోత్సవ ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఉత్తమ్ ముకాడే, వామన్, బాలాజీ, సంజీవ్ పాల్గొన్నారు.

బెహ్రెన్‌లో సారంగాపూర్ వాసి మృతి

కల్లూరి వెంకటేశ్(ఫైల్)

సారంగాపూర్, డిసెంబర్ 1: సారంగాపూర్‌కు చెందిన కల్లూరి వెంకటేశ్ బెహ్రెన్ దేశంలో మృతి చెందినట్లు అక్కడి ప్రవాస భారతీయులు తెలిపారు. వెంకటేశ్ ఉపాధి నిమిత్తం బెహ్రెన్ దేశానికి వెళ్లాడు. కొద్ది రోజుల్లోనే ఇంటికి వచ్చేందుకు సమాయత్తం అవుతున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం అక్కడి దవాఖానలో చేరిన ఆయనకు చక్కెర లెవెల్స్ బాగా పెరిగిపోయి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆయన నవంబర్ 24న మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుడి బంధువులు ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్‌కు తెలపడంతో యూనియన్ లీడర్స్ ఇండియన్ ఎంబసీకి సమాచారం చేరవేశారు. అక్కడి సామాజిక కార్యకర్తలైన నోముల మురళి, విద్యాసాగర్, షేక్ అహ్మద్ సహాయంతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరనుంది. మృతదేహాన్ని సారంగాపూర్ చేర్చేందుకు ప్రభుత్వ అంబులెన్స్ ఏర్పాటు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

సీఎం కప్ 2కే రన్‌ను ప్రారంభించిన కలెక్టర్

ఎదులాపురం, డిసెంబర్ 1: ప్రజాపాలన విజయోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సీఎం కప్ 2కే రన్‌ను ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా ఆయా క్రీడల్లో రాణించిన క్రీడాకారులను కలెక్టర్ సత్కరించారు. అదే విధంగా ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఐఈవో రవీందర్, డీఎస్పీ జీవన్ రెడ్డి, డీఎంవో శ్రీధర్